క్లుప్తంగా

నేడు నారాయణఖేడ్ మండల సమావేశం

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ చాందీబాయి అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

పరామర్శ

నారాయణఖేడ్: కల్హేర్ మండలం మొదళ్లకుంట తండాకు చెందిన రామునాయక్ విద్యుత్‌షాక్‌కు గురై ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకొని సోమవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

విజయగాథ పుస్తకం అందజేత



ఎమ్మెల్యేకు విజయగాథ పుస్తకాన్ని అందజేస్తున్న అంజయ్య

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను సోమవారం రిటైర్డ్ ఎంఈఓ దండు అంజయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ×పేదల గురువు అంజయ్య, బాల కార్మికుల విజయగాథల౯ పుస్తకాన్ని అందజేశారు. అనంతరం ఈనెల 15న సంగారెడ్డిలో తన పదవీ విరమణ కార్యక్రమానికి రావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని నందికంది గ్రామ శివారులో జరిగింది. తెలిసిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి నుంచి సదాశివపేట వైపునకు వెళ్తున్న ఓ బైక్‌ను నందికంది గ్రామం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వారు ఇక్కడికి చేరుకొని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

క్యాంటీన్ ప్రారంభం



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ ఆర్టీసీ బస్టాండ్ లో ఏర్పాటు చేసిన అన్నపూర్ణ హోటల్ క్యాంటీన్‌ను సోమవారం డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి క్యాంటీన్‌ను సందర్శించారు. క్యాంటీన్ యజమాని పుండరీకం అతిథులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు, జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ నజీబ్, పరమేష్, నగేష్, అభిషేక్ షెట్కార్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌తో ఈనెల 15న పట్టణంలోని ఎస్సీ కాలనీలో నిర్వహించనున్న మాదిగల జనసభకు సంబంధించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆవిష్కరించారు. ఈ సభను విజయవంతం చేయాలని మాదిగ ఐకాస నియోజకవర్గ ఇన్‌చార్జి పగిడిపల్లి రమేష్ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు నర్సింహులు, సద్దాం, ఐకాస నాయకులు మనోహర్, కిరణ్ కుమార్, సుకుమార్, రాములు, మోజెస్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నారాయణఖేడ్: మండలంలోని కొండాపూర్ పంచాయతీ పరిధి సామ్యానాయక్ తండాలో సోమవారం భవానీమాత, సేవాలాల్ మహారాజ్ ఆలయాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

డ్రైనేజీ వ్యవస్థ.. అస్తవ్యస్తం

- పాతబస్తీలో పడకేసిన పారిశుద్ధ్యం
- రోడ్లపై పారుతున్న మురుగునీరు
- దుర్గంధం వెదజల్లుతున్న పరిసరాలు
- అనారోగ్యాలకు గురవుతున్న ప్రజలు



నాగులకట్ట బసవేశ్వర మందిరం ముందు నిలిచిన మురుగునీరు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని పాత బస్తీలో పారిశుద్ధ్యం పడకేసింది. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారడమే ఈ దుస్థితికి కారణం. అధికారుల నిర్లక్ష్యంతో మురుగు కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయి ఎక్కడిక్కడే జాం అవుతున్నాయి. దీంతో మురుగునీరు ముందుకు వెళ్లకుండా రోడ్లపై నుంచే ఏరులై పారుతోంది. పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకునేవారే కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు. పట్టణంలోని నాగులకట్ట ప్రాంతంలో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉన్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

శిథిలావస్థలో మురుగు కాలువలు

పాతబస్తీలు అయిన నాగులకట్ట, మాణిక్‌ప్రభు వీధి, పాండురంగ మొహల్లా తదితర ప్రాంతంలో మురుగు కాలువలు దశాబ్దాల క్రితం నిర్మించారు. దీంతో కాలువలు శిథిలావస్థకు చేరడంతో మురుగు పేరుకపోయి నీరు ముందుకు వెళ్లడం లేదు. ముఖ్యంగా నాగులకట్ట బసవేశ్వర మందిరం ముందు ఉన్న మురుగు కాలువ నుంచి నీరు ముందుకు వెళ్లకపోవడంతో నీరంతా రోడ్డుపైకి వచ్చి చేరుతోంది. దీంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతూ ఆస్పత్రుల పాలవుతున్నారు. డ్రైనేజీ తదితర సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బసవేశ్వర మందిరం ముందు ఉన్న మురుగు కాలువ నుంచి నీరు ముందుకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



తనిఖీ చేస్తున్న ఏఓ ప్రవీణ్‌చారి

కంగ్టి(నారాయణఖేడ్): నకిలీ విత్తనాలు, మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కంగ్టి ఏఓ ప్రవీణ్‌చారి హెచ్చరించారు. సోమవారం కంగ్టిలో ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధరల పట్టికలు, స్టాక్ బోర్డు, స్టాక్ రిజిస్టర్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు, మందులు కొనుగోలుచేసి మోసపోవద్దని రైతులకు సూచించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నారాయణ పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈవో శంకర్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతోపాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ఎంఈవో శంకర్ తెలిపారు. సోమవారం విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న పాఠ్య పుస్తకాలను ఆయన ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చదువుల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

నీట్ పరీక్షపై విచారణ జరిపించండి

సంగారెడ్డి టౌన్: నీట్ అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలో ఇటీవల జరిగిన అవకతవకలపై సంగారెడ్డిలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న ఎలాంటి హడావుడి లేకుండా ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో నీట్ ఫలితాలను విడుదల చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు



కండువా కప్పుతున్న ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్: శివ్వంపేట మండలంలోని పిల్లుట్లకు చెందిన పలువురు సోమవారం బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరారని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి చెప్పారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పిల్లుట్లకు చెందిన దాసరి కృష్ణతోపాటు పలువురు నాయకులు స్థానిక తన క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరారని, వారికి పార్టీ కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించామన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, పార్టీ నాయకులు సుహాసినిరెడ్డి, కరుణాకర్ రెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు చేపట్టాలి

నర్సాపూర్: గత సంవత్సరం కోర్టు కేసుతో నిలిచిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను విడుదల చేయడం హర్షిస్తున్నామని పీఆర్‌టీయూ టీఎస్ మండలశాఖ ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్ అన్నారు. రాష్ట్రంలో పదివేల ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేస్తూ ఈ బదిలీల షెడ్యూల్లోనే పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టు మంజూరు చేయాలని ఆయన కోరారు. అందుకు పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకత్వం చొరవ తీసుకోవాలని కోరారు.

గుండె పోటుతో ఉద్యోగి మృతి



నర్సాపూర్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగస్తురాలు గుండెపోటుతో మృతి చెందారు. పట్టణానికి చెందిన ఉప్పరి లక్ష్మి(45 కొన్నేళ్లుగా ఔట్ సోర్సిగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున గుండె నొప్పిగా ఉండడంతో కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కౌన్సిలర్లు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

టిప్పర్ల యజమానులపై కేసు

నర్సాపూర్: అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న టిప్పర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు. సీఐ జాన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమ తులు లేకుండా మూసాపేట చెరువు నుంచి మట్టినితీసి టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. అనుమతులు లేని టిప్పర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలు సిద్ధం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రమైన చిలప్‌చెడ్‌లోగల అంగన్‌వాడీలలో ప్రీస్కూల్ పూర్తయిన చిన్నారులను సోమవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక పాఠశాలలో చేర్పించామని మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత చెప్పారు. ఈ సందర్భంగా ఎంఈఓ బుచ్యానాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు అన్ని సౌకర్యాలతో సిద్ధమవుతున్నాయన్నారు. విద్యార్థులకు ఉచిత యూనిఫాంలు, భోజనం, పుస్తకాలతో పాటు నాణ్యమైన విద్య అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వేదశ్రీ, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనుబాబు, సీఆర్‌పీ రాజశేఖర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

భుజిరంపేట పాఠశాలలో..

కౌడిపల్లి(నర్సాపూర్): బడిబాట కార్యక్రమంలో భాగంగా భుజిరంపేట ప్రాథమిక పాఠశాలలో 22మంది విద్యార్థులను చేర్పినట్లు హెచ్‌ఎం శంకర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ భుజిరంపేట, వెంకటాపూర్ గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పాఠశాల వసతులపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

కేంద్ర మంత్రులను కలిసిన ఢిల్లీ వసంత్



కేంద్ర మంత్రి యశోశ్రీపాద్ నాయక్‌ను కలిసిన ఢిల్లీ వసంత్

జహీరాబాద్ టౌన్: సామాజిక ఉద్యమకారులు, బీజేపీ నాయకులు ఢిల్లీ వసంత్ సోమవారం ఢిల్లీలో కేంద్ర మంత్రులు యశోశ్రీపాద్ నాయక్, కిషన్‌రెడ్డి, బండిసంజయ్ కుమార్‌లను కలిశారు. జహీరాబాద్ ప్రాంత ప్రజల తరఫున వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పలువురు బీజేపీ నాయకులు ఉన్నారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: భార్య అదృశ్యంపై ఫిర్యాదు చేసిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని చిలకలూరిపేటకు చెందిన బాపయ్య బతుకుతెరువు కోసం అయిదేళ్ల క్రితం భార్య జ్యోతిరాణి, ఇద్దరు పిల్లలతో భీరంగూడ మల్లారెడ్డినగర్‌కు వచ్చి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో వారింటికి జ్యోతిరాణికి వరసకు అల్లుడైన దిలీప్ వచ్చి కొన్నాళ్లపాటు ఉన్నాడు. అయితే దిలీప్ 7వ తేదీన వెళ్లిపోయాడు. అదేరోజు ఆమె కూడా వెళ్లడంతో అల్లుడైన దిలీప్‌తో వెళ్లినట్లు అనుమానం ఉందని బాపయ్య ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆర్థికసాయం

జిన్నారం(పటాన్‌చెరు): కాల్షియం తక్కువ కావటంతో ఓ వ్యక్తికి కాళ్లు చచ్చుపడిపోయిన విషయాన్ని సోషల్ మీడియా ద్వారా సోనూసూద్ చారిటీ సభ్యులు తెలుసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. సూర్యాపేట జిల్లా సింగిరెడ్డిపాలెంలో నివాసం ఉంటున్న ఆకుల రాజు కొంతకాలంగా కాళ్లు చచ్చుపడిపోవడంతో అనారోగ్యానికి గురయ్యాడు. విషయాన్ని తెలుసుకుని బొల్లారంకు చెందిన సోనూసూద్ చారిటీ సభ్యుడు ప్రవీన్‌రెడ్డి సోమవారం రూ.5వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

నియామకం

సంగారెడ్డి: ప్రపంచ వ్యాప్తంగా హిందీ భాషాభివృద్ధి కోసం కృషి చేసే విశ్వ హిందు పరిషత్ సంస్థ దక్షిణ భారతదేశ వ్యవహారాల బాధ్యుడిగా నారాయణఖేడ్‌కు చెందిన డాక్టర్ రవికుమార్‌గౌడ్ నియమితులయ్యారు. ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ నుంచి రవికుమార్‌గౌడ్ నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్‌గౌడ్‌ను రైతు ఉద్యమకారుడు ఢిల్లీ వసంత్ అభినందనలు తెలిపారు.

నలుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ నలుగురికి జిల్లా కోర్టు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో నలుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికీ రూ.2వేలు చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి పనులను వేగిరం చేయండి

రామచంద్రాపురం (పటాన్ చెరు): డివిజన్ పరిధిలో జరిగే అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ పుష్ప నగేశ్ అన్నారు. సోమవారం పట్టణంలోని వార్డు అధికారులతో కలిసి ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అభివృద్ధికి అందరూ సహకరించాలని కార్పొరేటర్ సూచించారు.

రామ శిలాయాత్రకు తరలిరండి



మాట్లాడుతున్న మహేశ్వరశర్మ సిద్ధాంతి

సంగారెడ్డి టౌన్: ఈనెల 16వ తేదీన సంగారెడ్డిలో నిర్వహించే రామ శిలాయాత్రను విజయవంతం చేయాలని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వరశర్మ సిద్ధాంతి పిలుపునిచ్చారు. సోమవారం పసల్వాది గ్రామ శివారులోని ఆశ్రమంలో విలేకరులతో మాట్లాడారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా అరుదైన 18 అడుగుల పొడవు, 7 అడుగుల వెడల్పు, 10 అడుగుల ఎత్తుతో 128 టన్నుల బరువు కలిగిన శ్రీరాముని విగ్రహాన్ని ఒకే శిలలో నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విద్యాపీఠం సభ్యులు తోపాజి అనంతకిషన్, ప్రశాంత్ కుమార్, సెంథిల్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి

- అధికారులను ఆదేశించిన జెడ్పీటీసీ మీనాక్షి
- మండల సర్వసభ్య సమావేశం



ధరణి పోర్టల్‌పై వివరణ అడుగుతున్న ఎంపీడీఓ హరినందన్‌రావు

మునిపల్లి(అందోల్): గ్రామాలను అభివృద్ధి చేసిన ప్రజాప్రతినిధులకు పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ సంబంధిత అధికారులను కోరారు. ఆమెతోపాటు ఎంపీపీ శైలజ, ఎంపీడీఓ హరినందన్‌రావు ఆధ్వర్యంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. స్పెషల్ అధికారుల పాలనలో గ్రామాలకు ప్రత్యేక నిధులు మంజూరు కాకపోవడంతో అభివృద్ధి కుంటు పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్ వల్ల పౌతి చేసుకోవడానికి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని గోపులారం ఎంపీటీసీ సభ్యుడు పాండు ఉప తహసీల్దార్ కృపాదానం దృష్టికి తెచ్చారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ప్రభుత్వం పంటబీమా పథకం ప్రవేశ పెట్టిందని, రైతులుపట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, దరఖాస్తు ఫారాలను వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలని మండల వ్యవసాయాధికారి శివకుమార్ సభ దృష్టికి తెచ్చారు. ఈ పంట బీమాపై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



రాజ్‌కుమార్

జహీరాబాద్ టౌన్: బ్రహ్మణ సమాజం సేవా సంస్థ జహీరాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడిగా రాజ్‌కుమార్ దేశ్‌పాండే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలో సోమవారం నూతన కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బాలచందర్ జోషి, ఉపాధ్యక్షుడిగా పునీత్ దీక్షిత్, కృష్ణరావు కులకర్ణి, డాక్టర్ వెంకటరమణ, గౌరవ సలహాదారులుగా డాక్టర్ శేషు పద్మనాభరావు, శ్యామ్రావు కులకర్ణి, మద్రి రమేష్, మాణిక్‌రావు జోషి, సహాయ కార్యదర్శులుగా పరమేశ్వర్ అయ్యర్, విజయ్‌కుమార్ కులకర్ణి, ప్రచా ర కార్యదర్శిగా శ్రీనివాస్ శాస్త్రిలు ఎన్నికై య్యారు. మహిళా అధ్యక్షురాలిగా సరస్వతి కుల్‌కర్ణి, ప్రధాన కార్యదర్శిగా అఖిలా జోషి, కోశాధికారిగా భవాని కులకర్ణి, ఉపాధ్యక్షులు గా నర్మదా దేశ్ పాండే, గాయత్రి అయ్యర్, మంజులా కులకర్ణి, న్యాయ సలహాదారులు గా జె ఉమారాణి, గౌరవ సలహాదారులుగా డాక్టర్ సౌమ్య, హేమలత, వరలక్ష్మి, విజయలక్ష్మి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో జిల్లా అధ్యక్షులు సురేష్ జోషి, మహిళా అధ్యక్షురాలు ఉమా చంద్రకాంత్‌లు ప్రమాణ స్వీకారం చేయించారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

చినుకు పడిందంటే చిత్తడే



రోడ్డుపై నిలిచిన మురుగునీరు



మురుగునీటిని జేసీబీతో మళ్లిస్తున్న సిబ్బంది

- మురుగుకాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం
- రోడ్లపై పారుతున్న డ్రైనేజీ నీరు
- నామమాత్రపు చర్యలకే అధికారులు పరిమితం
- శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికుల విజ్ఞప్తి

శేరిలింగంపల్లి పరిధిలోని నల్లగండ్ల నుంచి తెల్లాపూర్ వెళ్లే మార్గంలోని తెల్లాపూర్ కమాన్ వద్ద నిత్యం రోడ్డుపై డ్రైనేజీ నీరు చేరడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల ఈ మార్గం నుంచే రాకపోకలు సాగిస్తున్నా సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపడంలేదని, సమస్య వచ్చినప్పుడు నామమాత్రంగా జేసీబీతో నీటిని పక్కకు మళ్లించి చేతులు దులుపుకుంటున్నారని స్థానికుల ప్రజలు వాపోతున్నారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)

వర్షం నీటి కాలువలోకి డ్రైనేజీ నీరు..

కొన్నేళ్లుగా తెల్లాపూర్ కమాన్ వద్ద తరచూ డ్రైనేజీ నీరు చేరుతోంది. నల్లగండ్ల నుంచి తెల్లాపూర్ మీదుగా కొల్లూర్ రింగ్ రోడ్డు వరకు రేడియల్ రోడ్డును అభివృద్ధి చేశారు. ఆ సమయంలో రోడ్డుకు ఇరువైపులా వర్షపునీరు వెళ్లేందుకు ప్రత్యేకంగా కాలువను నిర్మించారు. కానీ.. ఈ కాలువలోకి నల్లగండ్ల ప్రాంతంలోని పలు కాలనీలకు చెందిన డ్రైనేజీ నీరు రోడ్లపై చేరడమే కాకుండా సమీపంలోని చెరువుల్లోకి వెళ్తుండటంతో పరిసరాలు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి.

అదుపు తప్పుతున్న వాహనాలు

చిన్నపాటి వర్షం పడిందంటే ప్రయాణం ప్రమాదకరంగా మారుతోంది. వర్షం నీటితో పాటు డ్రైనేజీ నీరు రోడ్లపై నిలుస్తుండటంతో వాహనదారులు అదుపు తప్పి మురుగునీటిలో పడిపోతూ గాయాల పాలవుతున్నారు. మురుగునీరంతా రోడ్లపైకి వచ్చి చేరుతుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

మురుగు నీటిలోనే ప్రయాణం



తెల్లాపూర్ కమాన్ సమీపంలో మురుగునీరంతా నిత్యం రోడ్డుపైకి చేరుతోంది. నిత్యం ఈ మార్గంలో వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో భారీ వాహనాలు వెళ్తున్న క్రమంలో మురుగునీరంతా ద్విచక్ర వాహనదారులపై పడుతోంది. దీంతో మురుగు నీటిలో ప్రయాణించాల్సిన పరిస్థితి ఉంది.

– రవి, ఇందిరానగర్

తిప్పలు తప్పడం లేదు



తెల్లాపూర్ కమాన్ సమీపంలోనే రోడ్డు పక్కనే బ్యాంక్ ఉండటంతో రోడ్డుపై మురుగునీరు నిలిచినప్పుడు ఖాతాదారులు మురుగు నీటిలోనే నడుస్తూ బ్యాంకుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. దీంతో వృద్ధులు, మహిళలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇక వర్షకాలంలో పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటోందని స్థానికులు వాపోతున్నారు.

– స్టాలిన్, తెల్లాపూర్

సమస్య పరిష్కారానికి కృషి



రోడ్లపై మురుగునీరు నిలువకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. సమస్యను శ్వాశతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తాం.

– సంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్, తెల్లాపూర్